
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
మంచిర్యాల జిల్లా వార్తలు
5
మంగళవారం 12 నవంబరు 2024

ఏజెన్సీ భూమి కబ్జా

- అక్రమంగా మినీ రైస్‌మిల్లు ఏర్పాటు
- పట్టించుకోని అధికారులు



ముత్యంపేట పరిధిలోని సర్వే నంబరు 17లో అక్రమంగా నిర్మించిన రైస్ మిల్లు

మంచిర్యాల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏజెన్సీ భూముల కబ్జా కొనసాగుతోంది. గిరిజన చట్టాలకు తూట్లు పొడుస్తూ గిరిజనేతరులు భూములు కబ్జా చేస్తున్నారు. ఈ తంతు బహిరంగంగా జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దండేపల్లి మండలం ముత్యంపేట గ్రామం ఏజెన్సీ ప్రాంతంలో ఉంది. ఇక్కడ గిరిజన చట్టాలైన 1/70, పెసా చట్టాలు అమలులో ఉన్నాయి.


అయినప్పటికీ గిరిజనేతరుడైన కొర్విచెల్మ నివాసి ముద్దసాని వేణు ముత్యంపేట గ్రామంలో సర్వే నంబరు 17లో 34 గుంటలతోపాటు దాని సమీపంలోని మరో ఆరు గుంటల భూమిని ఆక్రమించాడు. ఎలాంటి అనుమతులు లేకుండా, కనీసం గ్రామ పంచాయతీ ట్రేడ్ లైసెన్స్ కూడా పొందకుండా మినీ రైస్‌మిల్లును నిర్వహిస్తున్నాడు.

పంచాయతీలో ఇంటి పన్ను వసూలు రిజిస్టర్‌లో అక్రమంగా పేరు నమోదు చేయించుకున్నాడు. కేవలం ఇంటి పన్ను చెల్లిస్తూ మినీ రైస్‌మిల్ వ్యాపారం చేస్తున్నా అడిగే వారు కరువయ్యారు. సదరు భూమి బహిరంగ మార్కెట్ విలువ రూ.కోటి పై చిలుకు ఉంటుందని అంచనా. ఈ విషయం స్థానికంగా చర్చకు దారితీసింది.

గిరిజనులకు కేటాయించిన స్థలం ఆక్రమణ

సర్వే నంబరు 17లోని భూమిని గ్రామానికి చెందిన ఇళ్లు లేని గిరిజనులకు ఉట్నూరు ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ ఇంటి స్థలాలు మంజూరు చేయాలని దండేపల్లి తహసీల్దార్‌ను ఆదేశించారు. పీవో ఆదేశాలను తహసీల్దార్ పట్టించుకోకుండా ఇప్పటి వరకు ఇంటి స్థలాలు ఇవ్వలేదు. సదరు భూమిలో అక్రమంగా రైస్‌మిల్ ఏర్పాటు చేసిన వ్యాపారిపై చర్యలు తీసుకోలేదు. తన పలుకుబడిని ఉపయోగిస్తూ భూమిలో నివాస స్థలాలు ఏర్పాటు కాకుండా అడ్డుపడుతున్నాడని స్థానికులు చెబుతున్నారు.

మిగతా 7వ పేజీలో..



అధికారులు రూపొందించిన లే అవుట్ ప్లాన్

సంక్షేమ పథకాలతో ప్రజలకు లబ్ధి



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే వినోద్

బెల్లంపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలతో ప్రతీ కుటుంబం లబ్ధి పొందుతుందని ఎమ్మెల్యే వినోద్ అన్నారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారంటీలను అమలు చేస్తూ రాష్ట్రాభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి ముందుకు వెళ్తున్నారన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరయ్యాయని, తాగునీటి సమస్య, రహదారుల ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. నాతరి స్వామి, బండి ప్రభాకర్, నీలి కృష్ణ పాల్గొన్నారు.

మత్స్యకారుల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

తాండూర్, (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గడ్డం వినోద్‌వెంకటస్వామి అన్నారు. సోమవారం బోయపల్లి పెద్ద చెరువులో అధికారులతో కలిసి 9 వేల చేప పిల్లలను వదిలారు. ఆయన మాట్లాడుతూ చేపల ఉత్పత్తిని గణనీయంగా పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఈసా, నాయకులు రవీందర్‌రెడ్డి, సిరంగి శంకర్, మహేందర్‌రావు, సాలిగాం బానయ్య, శ్రీనివాస్,వేణు, మత్స్య సంఘం నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వీవోఏల ధర్నా

నస్పూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని డిమాం డ్ చేస్తూ తెలంగాణ ఐకేపీ, వీవోఏ ఉద్యోగుల సంఘం (సీఐటీయు) ఆధ్వ ర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం 48 గంటల ధర్నా చేపట్టారు. డిమాండ్లను పరిష్కరించా లంటూ నినాదాలు చేశారు. నాయకులు మాట్లాడుతూ బకాయి ఉన్న స్త్రీ నిధి ఇన్సెంటివ్ వెంటనే గ్రామ సంఘాలకు చెల్లించాలన్నారు. గ్రామ సంఘం నుంచి రూ. మూడు వేల గౌరవ వేతనం ఇవ్వాలన్నారు. ప్రతీ నెల వేతనం సక్రమంగా రావడం లేదన్నారు. గ్రామ సంఘానికి ట్యాబ్ సౌకర్యం కల్పించాలన్నారు. వివోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి భద్రత కల్పించాలన్నారు. ప్రభుత్వ హామీ ప్రకారం రూ.20 వేల వేతనం, బీమా సౌకర్యం కల్పించాలన్నారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని రెండు రోజుల పాటు ఆందోళన చేపట్టమన్నారు. ఉద్యోగుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు దుంపల రంజిత్ కుమార్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కుంటాల కుమార్, దుర్గం రాములు, కోశాధికారి పోచం, నాయకులు లింగయ్య సుజాత, సరిత, లలిత, కిరణ్, కవిత, రాజ్యలక్ష్మి, పద్మ, సమ్మయ్య పాల్గొన్నారు.

జీజీహెచ్‌ను సందర్శించిన డీఎంహెచ్‌వో



రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్

గర్మిళ్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్)ను సోమవారం డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్ సందర్శించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరీష్ చంద్రరెడ్డితో కలిసి ఫిజియోథెరపి, పాలియేటివ్, ఎన్‌సీడీ కేర్ విభాగాలను పరిశీలించారు. సిబ్బంది రిజిష్టర్‌లతోపాటు రికార్డులను తనిఖీ చేశారు. ఆయా విభాగాల సిబ్బందికి పలు సూచనలు చేశారు. పాలియేటివ్ కేర్ విభాగాన్ని తనిఖీ సమయంలో సిబ్బంది వివరాలతో కూడిన నేమ్ బోర్డుపై పాత పేర్లే ఉండడంతో ప్రస్తుతం విధుల్లో ఉన్న వారి పేర్లను చేర్చాలని, ఇది కూడా నేనే చెప్పాలా అని సిబ్బందిని మందలించారు. విధుల్లో నిర్లక్ష్యం చేయవద్దని, సమయపాలన పాటించాలని సూచించారు.

విద్యుత్ శాఖ ఎస్ఈగా గంగాధర్



గర్మిళ్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈగా గంగాధర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వహించిన శ్రావణ్‌కుమార్ కామారెడ్డికి బదిలీ కాగా ఆయన స్థానంలో కరీంనగర్ నుంచి గంగాధర్ బదిలీపై ఇక్కడకు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన ఆయన మాట్లాడుతూ జిల్లాలోని విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

నిలిచిన పత్తి కొనుగోళ్లు

బెల్లంపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మార్కెట్ యార్డుల్లో సోమవారం పత్తి కొనుగోళ్లు నిలిచిపోయాయి. సీసీఐ వైఖరికి నిరసనగా రాష్ట్ర పత్తి సంఘం పిలుపుమేరకు మార్కెట్‌లో కొనుగోళ్లు నిలిపివేసినట్లు వ్యాపారులు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం 7 సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేయగా సోమవారం కొనుగోళ్లు జరగలేదు. శని, ఆదివారాలు సెలవు కావడంతో సోమవారం రైతులు పత్తిని కేంద్రాలకు తీసుకువచ్చారు. పత్తి కొనుగోలు బంద్ ఉండడంతో విషయం తెలుసుకున్న ప్రైవేటు వ్యాపారులు పలు మిల్లుల వద్దకు వచ్చి రైతుల వద్ద నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేశారు. చేసేది లేక రైతులు దళారులకు విక్రయించారు.

ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించేందుకు చర్యలు



ఆర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 11 (ఆంధ్ర జ్యోతి): ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకొంటున్నామని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం కలె క్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలు శ్రీనివాసరావు, హరికృష్ణతో కలిసి ఆర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించా రు. కోటపల్లి, నెన్నెల, జన్నారం, కాసిపేట, బెల్లం పల్లి, లక్షెట్టిపేట ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు దరఖాస్తులు అందజేశారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకొంటామన్నారు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు చిరస్మరణీయం

దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా విద్యాభివృద్ధికి కృషి చేసిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు చిరస్మరణీయమని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం ఆజాద్ జయంతిని కలెక్టరేట్‌లో జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ ఆజాద్ చిత్రపటానికి పూలమాల లు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ దేశ విద్యావ్యవస్థకు ఆజాద్ అందించిన సేవలను గౌరవించుకుంటూ జయంతి రోజున జాతీయ విద్యా దినోత్సవం, జాతీయ మైనార్టీ దినోత్సవాలను జరుపుకుంటున్నామన్నారు. అదనపు కలెక్టర్ మోతిలాల్, జిల్లా మైనార్టీ శాఖ అధికారి రాజేశ్వరి అధికారులు పాల్గొన్నారు.

సర్వేలో వివరాలు స్పష్టంగా నమోదు చేయాలి



సర్వేను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి కృష్ణ ఆదిత్య, కలెక్టర్ కుమార్‌దీపక్

మంచిర్యాల అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రక్రియలో వివరాలను స్పష్టంగా నమోదు చేయాలని ప్రత్యేక అధికారి కృష్ణ ఆదిత్య అన్నారు. సోమవారం కలెక్టర్ కుమార్ దీపక్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సబావత్ మోతిలాల్, ఆర్డీవో శ్రీనివాస్‌రావు, మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్‌లతో కలిసి మంచిర్యాలలోని 5, 27వ వార్డుల్లో పరిశీలించారు. ప్రత్యేకాధికారి మాట్లాడుతూ ఇండ్ల జాబితా పూర్తయిందని, ఎన్యూమరేటర్లు తమకు కేటాయించిన బ్లాక్‌లలో పూర్తి స్థాయిలో కుటుంబ వివరాలు స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. సర్వే ముందు రోజు ఏ ప్రాంతంలో సర్వే నిర్వహిస్తున్నారో సంబంధిత కుటుంబసభ్యులకు సమాచారం అందించాలని, ఇంటి యజమానులు అవసరమైన పత్రాలతో హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

జైపూర్,(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పకడ్బం దీగా చేపట్టాలని జిల్లా ప్రత్యేకాధికారి (స్టేట్ ఆఫీసర్) కృష్ణ ఆదిత్య పేర్కొన్నారు. సోమవారం శెట్‌పల్లిలో చేపడుతున్న సర్వేను కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి పరిశీలించారు. ఇంటింటికి వెళ్లి సర్వే తీరును పరిశీలించారు. సర్వే ఫారాలను తనిఖీ చేశారు. ఎన్యూమరేటర్ రోజు 25 ఇండ్లు సర్వే చేయాలని, సర్వేలో తప్పులు లేకుండా నమోదు చేయాలని, కుటుంబ యజమానితో అన్ని వివరాలు తెలుసుకుని నమోదు చేయాలన్నారు. అదనపు కలెక్టర్ మోతిలాల్, డీఆర్‌డీవో కిషన్, ఎంపీడీవో సత్యనారాయణ, తహసీల్దార్ వనజారెడ్డి, ఏపీఎం రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



చెన్నూరు మండలం కిష్టంపేటలో సర్వేను పరిశీలిస్తున్న డీపీవో వెంకటేశ్వర్‌రావు

కాసిపేట, (ఆంధ్రజ్యోతి): దేవాపూర్, పల్లంగూడ, పెద్దనపల్లి, కోమటిచేను, బుగ్గ గూడ, మల్కేపల్లి, గట్రావుపల్లిలో చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను సోమవారం ఎంపీడీవో సత్యనారాయణసింగ్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 9919 కుటుంబాలు ఉండగా ఇప్పటి వరకు 2093 కుటుంబాలను సర్వే చేశామని తెలిపారు. ఎంపీవో సప్దర్ ఆలీ, సూపరింటెండెంట్ లక్ష్మయ్య, సీనియర్ సహాయకులు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

చెన్నూరు, (ఆంధ్రజ్యోతి): కిష్టంపేట గ్రామంలోని దబ్బేటిగూడెంలో చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను సోమవారం డీపీవో, మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్‌రావు పరిశీలించారు. ప్రతీ ఇంటిని సర్వే చేసి వివరాలను తప్పులు లేకుండా నమోదు చేయాల ని పేర్కొన్నారు. ఎంపీవో అజ్మత్ ఆలీ, పంచాయతీ కార్యదర్శి మదుకర్ ఉన్నారు.

మందమర్రి రూరల్, (ఆంధ్రజ్యోతి): కుటుంబ ఇంటింటి సర్వేను సోమవారం ఎంపీడీవో రాజేశ్వర్ పొన్నారంలో పరిశీలించారు. సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ప్రజలు సర్వే సిబ్బందికి సహకరించి వివరాలను తెలుపాలన్నారు. కార్యదర్శులు, ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.

భీమారం, (ఆంధ్రజ్యోతి): సర్వేను తహసీల్దార్ సదానందం పరిశీలించారు. ప్రతీ ఇంటిని సర్వే చేసి కుటుంబీకుల వివరాలను నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు.

తాండూర్, (ఆంధ్రజ్యోతి): బోయపల్లిలో జరుగుతున్న సమగ్ర సర్వేను తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్ పఠాన్, ఎంపీడీవో శ్రీనివాస్‌లు పరిశీలించారు. కుటుంబీకుల వివరాలు నమోదు చేసిన ఫారాలను పరిశీలించారు. సర్వే పకడ్బందీగా తప్పులు లేకుండా చేయాలని సూచించారు. వారి వెంట అధికారులు ఉన్నారు.

పెళ్లి ఖర్చులు తడిసి మోపెడు

- మారిన పెళ్లిళ్ల ధోరణి
- హంగు ఆర్భాటాలతో వేడుకలు
- లక్షల రూపాయల ఖర్చుకు వెనకాడని తీరు

7



అంకిత భావం..ఆదర్శం..

- జీవశాస్త్రంపై ఆకట్టుకునేలా ప్రత్యక్ష విద్యాబోధనలు
- ఐఐటీ గుజరాత్ వర్క్‌షాపునకు ఎంపిక
- ఉత్తమ ఉపాధ్యాయుడిగా గుర్తింపు పొందుతున్న వడ్లూరి రాజేష్

6



వరి నాట్లపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు రాజేష్

వజ్రా రెసిడెన్సీ ప్రారంభం



వజ్రా రెసిడెన్సీని ప్రారంభిస్తున్న నిర్వాహకులు

మంచిర్యాల అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని సాయిబాబా దేవాలయం రోడ్డు, జాఫర్‌నగర్‌లో సోమవారం వజ్రా రెసిడెన్సీ సోమవారం ప్రారంభమైంది. నిర్వాహకులు బోరిగాం శ్రీనివాస్, రాజ్‌కుమార్ రేన్వా, బియ్యాల శ్రీనివాస్, వంగల శ్రీనివాస్‌లు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. వేదపండితులు వేదమంత్రోచ్ఛారణల నడుమ పూజలు నిర్వహించారు. నిర్వాహకులు మాట్లాడుతూ పట్టణంలో 3స్టార్ హోటల్ తరహాలో రెసిడెన్సీని ప్రారంభించామని, తమ రెసిడెన్సీలో రెస్టారెంట్, బంకెట్ హాల్, రూమ్స్ అందుబాటులో ఉంటాయన్నారు. ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, వైస్ చైర్మన్ సల్ల మహేష్, కౌన్సిలర్లు, రాజకీయ పార్టీల నాయకులు, ప్రముఖులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష దీపోత్సవం



శివలింగానికి అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే దంపతులు, దీపాలను వెలిగిస్తున్న మహిళలు

బెల్లంపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసాన్ని పురస్కరించుకుని సోమవారం రాత్రి పట్టణంలోని ఎంసీ క్రీడా మైదానంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆధ్వర్యంలో లక్ష దీపోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. బాసంపల్లి సంతోష్‌కుమార్ ప్రవచనాలను బోధించారు. ఎమ్మెల్యే వినోద్ దంపతులు శివలింగానికి అభిషేకాలు నిర్వహించారు. అలాగే శివ పార్వతుల కల్యాణ మహోత్సవం కమనీయంగా జరిగింది. అనంతరం లక్ష దీపోత్సవ కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభించారు. మహిళలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి కార్తీక దీపాలను వెలిగించారు. అంగరంగ వైభవంగా కార్తీక మాస లక్ష దీపోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ దంపతులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

కడుపునొప్పి భరించలేక విద్యార్థి ఆత్మహత్య

జైపూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన ఎల్కపల్లి మనోజ్‌కుమార్ (16) అనే విద్యార్థి కడుపునొప్పి భరించలేక ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కరీంనగర్ జిల్లా వీణవంక మండలం జంగంపల్లి గ్రామానికి చెందిన ఎల్కపల్లి రాజేందర్ జైపూర్‌లో నివాసం ఉంటూ ఎస్టీపీపీలో పనిచేస్తున్నాడు. రాజేందర్ కుమారుడు మనోజ్‌కుమార్ కొన్ని రోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఆదివారం రాజేందర్ స్వగ్రామానికి వెళ్లగా మనోజ్‌కుమార్, సోదరి అంజలి ఇంట్లో ఉన్నారు. అంజలి ఇంటి పక్క వారింటికి వెళ్లి తిరిగి వచ్చే సరికి మనోజ్‌కుమార్ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి 4 సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతిచెందింది. మనోజ్‌కుమార్ జైపూర్ ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీధర్ తెలిపారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య


తిరుపతి(ఫైల్)

చింతలమానేపల్లి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): గూడెం గ్రామానికి చెందిన బుజాడి తిరుపతి(25) ఆదివారం రాత్రి ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారకస్థితిలో పడి ఉన్న తిరుపతిని కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం మహారాష్ట్రలో గల అహిరి ప్రభుత్వా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతికి గల కారణాలపై ఎస్సై నరేష్‌ను వివరణ కోరగా ఇక్కడ ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు


వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ వెంకటేశ్వర్లు

చెన్నూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ముత్తరావుపల్లి గ్రామంలో పైడిపల్లి మల్లయ్యను హత్య చేసిన ఘటనలో నిందితుడు జాడి భూమయ్యను అరెస్టు చేసినట్లు ఏసీపీ వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ముత్తరావుపల్లి గ్రామానికి చెందిన జాడిభూమయ్య భార్య సౌందర్యను మల్లయ్య కుమారుడు రాజశేఖర్ హైద్రాబాద్‌కు తీసుకువెళ్లాడు. ఈ విషయమై రాజశేఖర్, సౌందర్య కుటుంబీకుల సమక్ష్యంలో కౌన్సెలింగ్ నిర్వహించినప్పటికీ రాజశేఖర్‌తోనే హైద్రాబాద్‌కు వెళ్లిందన్నారు. దీంతో భూమయ్య రాజశేఖర్, అతని తండ్రి మల్లయ్యపై కోపం పెంచుకున్నాడు. ఈ నెల 9న బహిర్భూమికి వెళ్లిన మల్లయ్యపై కొడవలితో దాడి చేసి హతమార్చి పరారైనట్లు తెలిపారు. సోమవారం భూమయ్యను కిష్టంపేట వద్ద అదుపులోకి తీసుకుని హత్యకు ఉపయోగించిన కొడవలి, దుస్తులను స్వాధీనం కోర్టులో హాజరు పర్చినట్లు వెల్లడించారు. సీఐ రవీందర్, ఎస్ఐ సుబ్బారావులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

మంచిర్యాల అర్బన్, నవంబర్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని హమాలీవాడలో గంజాయి విక్రయిస్తున్న షేక్ హుస్సేన్‌ను అరెస్టు చేసి, అతని వద్ద నుంచి 115 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ గురువయ్య తెలిపారు. సోమవారం పక్కా సమాచారం మేరకు నిందితుడు విజయనగర్‌కాలనీ బోర్డు సమీపంలో గంజాయి విక్రయించేందుకు యత్నించగా పట్టణ సీఐ ప్రమోద్‌రావు సహకారంతో అరెస్టు చేశామన్నారు. నార్కోటిక్ డ్రగ్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చినట్లు సీఐ తెలిపారు. ఎక్సైజ్ ఎస్సై శంకర్, సిబ్బంది లచ్చన్న, రాజేంద్రప్రసాద్, ప్రసాద్ పాల్గొన్నారు.

కొండచిలువ కలకలం

నెన్నెల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కొండచిలువ కలకలం రేపింది. సోమవారం ఓ హార్డ్‌వేర్ షాప్ వద్ద పని చేస్తున్న కూలీలకు కొండచిలువ కనిపించింది. స్థానికులు ఫారెస్టు అధికారులకు సమాచారం ఇచ్చారు. అధికారులు మందమర్రికి చెందిన స్నేక్ క్యాచర్ దినేష్ అగర్వాల్‌ను పిలిపించారు. ఆయన పామును చాకచక్యంగా పట్టుకున్నారు. కుశ్నపల్లి రేంజ్ అధికారి దయాకర్, డిప్యూటీరేంజర్ లక్ష్మీనారాయణ కొండ చిలువను జోగాపూర్ అడవిలో వదిలేశారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ

తాండూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సీసీ కెమెరాలతో నేరాలను తగ్గించవచ్చని తాండూర్ సీఐ కుమారస్వామి అన్నారు. ఆదివారం సీసీ కెమెరాలపై మండలంలోని వివిధ గ్రామాల దేవాలయం, చర్చి, మసీదు నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఆలయాలు, మసీదులు, చర్చీల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం ద్వారా పూర్తిస్థాయిలో రక్షణ ఉంటుందన్నారు. ఎస్ఐలు కిరణ్‌కుమార్, సౌజన్య, సిబ్బంది పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్

జైపూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రత్యేక అధికారి కృష్ణఆదిత్య పేర్కొన్నారు. సోమవారం శెట్‌పల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ మోతిలాల్‌తో కలిసి తనిఖీ చేశారు. కేంద్రం ఇన్‌చార్జిలు రజిత, కళావతిలను కేంద్రం విధివిధానాలు, రైతుల వివరాలను, ధాన్యం రకాలకు ఉన్న ధరలను తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మే రైతులు ఐరిస్ ద్వారా వారి పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. తహసీల్దార్ వనజారెడ్డి, ఎంపీడీవో సత్యనారాయణ, డీపీఎం వేణు, ఏపీఎం రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాండూర్, (ఆంధ్రజ్యోతి): తాండూర్, రేచిని, అచ్చలాపూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, ఎంపీడీవో శ్రీనివాస్‌లు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోకుండా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. ఆర్ఐ ఎజాజుద్దీన్, అధికారులు పాల్గొన్నారు.

దండేపల్లి, (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని లక్షెట్టిపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ దాసరి ప్రేమ్‌చందు అన్నారు. సోమవారం ముత్యంపేట, చింతపల్లి, తానిమడుగు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ సంధ్యరాణి, వైస్‌చైర్మన్ ఆరీఫ్‌లతో కలిసి ప్రారంభించారు. ఐకేపీ ఏపీఎం భూపతి బ్రహ్మయ్య, సీసీ తిరుపతి పాల్గొన్నారు.

మద్యం మత్తులో వ్యక్తిపై దాడి

మంచిర్యాల అర్బన్, నవంబర్ 11 (ఆంధ్రజ్యోతి): లక్ష్మి థియేటర్ సమీపంలో ఓ వ్యక్తిపై సోమవారం రాత్రి కొందరు మద్యం మత్తులో దాడికి పాల్పడ్డారు. శ్రీరాంపూర్ కృష్ణకాలనీకి చెందిన నగమోతు రమేష్ ఫైనాన్స్ వ్యాపారికి, మరికొందరికి మధ్య బైక్ ఫైనాన్స్ విషయమై గొడవ జరిగింది. వారి మధ్య మాటామాటా పెరగడంతో రమేష్‌పై దాడికి పాల్పడ్డారు. స్థానికులు అడ్డుకొని 100కు డయల్ చేసి సమాచారం అందించారు. హెడ్‌కానిస్టేబుల్ అన్వర్, కానిస్టేబుల్ తిరుపతి ఘటనా స్థలానికి చేరుకునేలోపే అక్కడి నుంచి పరారయ్యారు. గాయపడిన రమేష్‌ను పోలీసులు చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుల నుంచి ఫిర్యాదు అందలేదని సీఐ తెలిపారు.

అంకితభావం.. ఆదర్శం..

- జీవశాస్త్రంపై ఆకట్టుకునేలా ప్రత్యక్ష విద్యాబోధనలు
- ఐఐటీ గుజరాత్ వర్క్‌షాపునకు ఎంపిక
- ఉత్తమ ఉపాధ్యాయుడిగా గుర్తింపు పొందుతున్న వడ్లూరి రాజేష్


వడ్లూరి రాజేష్

వాంకిడి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన వడ్లూరి రాజేష్ అనే ఉపాధ్యాయుడు అంకిత భావంతో పనిచేస్తూ విద్యార్థులకు సులభంగా అర్థమ య్యే విధంగా జీవశాస్త్రంపై ప్రత్యక్ష విద్యాబోధనలు చేస్తూ తోటిఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని జనకాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వడ్లూరి రాజేష్ జీవ శాస్త్రములో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. విద్యార్థులకు జీవశాస్త్రం విషయాలు అర్థం కావడానికి గాను టీ షర్ట్‌పైన అంతర్గత అవయవాల చిత్రాలను ముద్రించి సులభంగా అర్థమయ్యే విధంగా బోధిస్తున్నాడు.

● సర్టిఫైడ్ ట్రైనర్‌గా గుర్తింపు

మోటివేషనల్ స్పీకర్‌గా, ఇంపాక్ట్ ఫౌండేషన్ శ్రీ గంప నాగేశ్వర్‌రావు ద్వారా సర్టిఫైడ్ ట్రైనర్‌గా గుర్తింపు పొందారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మోటివేషన్ తరగతులు చెబుతున్నారు. స్పీకర్‌గా ఉండడం వల్ల ఉచితంగా విద్యార్థులకు ఆన్‌లైన్‌లో జూమ్ ద్వారా యంగ్ మైండ్స్ లాంటి కార్యక్రమాల ద్వారా భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలు, తల్లిదండ్రుల పట్ల భక్తి గౌరవాన్ని పెంపొందిస్తున్నారు.

● వాట్సాప్ గ్రూపు ఏర్పాటు

సైన్స్ వాలా విత్ స్టోరీస్ అనే వాట్స్‌అప్ గ్రూపును క్రియేట్ చేసి విద్యార్థులకు నైతికవిలువలు, విద్యా సంబంధ విషయాలు నైతిక విలువలతో కూడిన కథలను బోధిస్తున్నారు. ఇంపాక్ట్ ఫౌండేషన్ సర్టిఫైడ్ ట్రైనర్ కావడం మూలంగా విద్యార్థులకు 10వతరగతి, ఇంటర్మీయట్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు పేరుతో జూమ్‌లో సమావేశం ఏర్పాటుచేసి సర్టిఫికేట్‌లు బహుకరిస్తున్నారు.


వరి నాట్లపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు రాజేష్

గైడ్‌టీచర్‌గా ప్రతిభా పురస్కారాలు

ఈ విద్యా సంవత్సంలో రాష్ట్రస్థాయిలో సైన్స్‌డ్రామా ఫెస్టివల్ ఎంపికలో తృతీయబహుమతి సాధించారు. కాగజ్‌నగర్‌లో జరిగిన జిల్లాసైన్స్ సెమినార్ గైడ్‌టీచర్‌గా ఇన్‌చార్జీ డీఈవో ఉదయ్‌బాబు చేతులమీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు.

● డూయింగ్ బై లెర్నింగ్ విధానంలో బోధనలు..

సైన్స్ విషయాలపై పూర్తి అవగాహన కల్పించేందుకు విద్యార్థులకు డూయింగ్ బై లెర్నింగ్ విధానంలో బోధించేందుకు విద్యార్థులను ఫీల్డ్ విజిట్ చేయిస్తున్నాడు. ప్రకృతిలో వివిధ మొక్కలు వాటి కణజా లాలు విధులను ప్రత్యక్షంగా చూపించడం ఈయన సొంతం. నిత్యం తరగతి గదిలో వివిధ సైన్సు విషయాలను ప్రత్యక్ష పద్ధతిలో లేబరేటరిలో ప్రయోగాలు చేస్తూ బోధిస్తూ నేటి సాంకేతికతను విద్యార్థులకు దగ్గర చేస్తున్నాడు. (ఐఎఫ్‌పీ) ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్‌ద్వారా పిల్లలకు విద్యాబోధన చేస్తున్నారు. పాఠ శాల విద్యార్థులను సైన్స్‌లో జిల్లా, రాష్ట్రస్థాయికి అనేక అంశాలలో తీసుకువెళ్లి ప్రశంసాపత్రాలు అందుకున్నారు. నేషనల్ సైన్స్ కాంగ్రెస్ సైన్స్ డ్రామా, సైన్స్‌సెమినార్ ఇన్స్పైర్ మనాక్ లాంటి వాటిలో జిల్లా, రాష్ట్రస్థాయికి పోటీపడేలా విద్యార్థులను సన్నద్ధం చేశారు. విద్యార్థుల్లో సైన్స్‌పట్ల అభిరుచి పెరిగేలా సమాజంలోని మూఢ నమ్మ కాలను తొలగించేలా జనగామాలో నిర్వ హించిన విజ్ఞానవేదిక రాష్ట్రస్థాయి పోటీలతోపాటు సిద్ది పేటలో జరిగిన రాష్ట్ర స్థాయి నేషనల్ సైన్స్ కాంగ్రెస్ పోటీలకు తమ విద్యార్థులు పోటీపడేలా ప్రోత్సహించారు. విద్యార్థులను తీసుకెళ్లారు.

● ఉత్తమ ఫలితాలపై ప్రత్యేకదృష్టి


రాజేష్‌ను సన్మానిస్తున్న కలెక్టర్, ప్రజాప్రతినిధులు

పాఠశాలలో విద్యార్థుల ఉత్తమఫలితాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ వార్షికపరీక్షలకు సన్నద్ధం చేయడంలో కీలకపాత్ర పోషిస్తున్నారు వడ్లూరి రాజేష్. వార్షికల పరీక్షల్లో వచ్చే మోడల్ ప్రశ్నలపై విద్యార్థులకు ఎప్పటికప్పుడు టాలెంట్‌టెస్టులు నిర్వహిస్తూ భయందోళనకు గురికాకుండా విద్యార్థులకు మనోధైర్యాన్ని కల్పిస్తున్నారు.

● ఐఐటీ గుజరాత్‌కు ఎంపిక

ఐఐటీ గుజరాత్ వర్క్‌షాప్‌కు జాయ్ ఆఫ్ మేకింగ్ అండ్ బ్రేకింగ్ టాయ్స్‌కు ఉపాధ్యాయుడు వడ్లూరి రాజేష్ ఎంపిక అయినట్లు పాఠశాల హెచ్ఎం ఉదయ్ బాబు తెలిపారు. జిల్లా నంచి ఐఐటీ గుజరాత్ వర్క్‌షాప్‌నకు ఎంపిక కావడం అభి నందనీయమన్నారు. ఉత్తమ ఉపాధ్యాయుడిగా గుర్తింపు పొందిన వడ్లూరి రాజేష్‌ను డీఈవో యాదయ్య, ఎంఈవో రాథోగ్ సుభాష్, ఎంఈవో, ఉపాధ్యాయులు ఈ సందర్భంగా అభినందించారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

బెజ్జూరు/చింతలమానేపల్లి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పార్టీ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషిచేయాలని బీజేపీ సంస్థాగత ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీశైలం అన్నారు. సోమవారం బెజ్జూరు, చింతలమానేపల్లి మండలకేంద్రాల్లో ఏర్పాటుచేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న స్థానికసంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపు కోసం కార్యకర్తలు ఇప్పటి నుంచే సిద్ధంగా ఉండాలన్నారు. ఈసారి సభ్యత్వనమోదుకు మంచి స్పందన లభించిందని అన్నారు. సమావేశంలో నాయకులు సుధాకర్, మనోహర్‌గౌడ్, శంకర్, రామయ్య, చింతలమానేపల్లిలో మల్లయ్య, సుదాకర్, మనోహర్‌గౌడ్, శంకర్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల నిరసన

బెజ్జూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట పారిశుధ్య కార్మికులు చెత్తట్రాక్టర్‌తో నిరసన తెలిపారు. ఆరు నెలల నుంచి తమకువేతనాలు ఇవ్వకపోతే తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలని కార్మికులు ప్రశ్నించారు. నెలనెలా వేతనాలు ఇస్తేనే తమ కుటుంబ పోషణ జరుగుతుందన్నారు. గతంలో నిరసన కార్యక్రమాలు చేపట్టగా ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికులకు నెలనెలా వేతనాలు ఇస్తామని చెప్పినా అముకావడం లేదని ఆరోపించారు.

ఎన్యూమరేటర్లపై పనిభారం తగ్గించాలి

కాగజ్‌నగర్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కుల గణన సందర్భంగా ఎన్యుమరేటర్లపై పనిభారం తగ్గించాలని టీఎస్‌యూటీఫ్ నాయకురాలు శాంతికుమారి తెలిపారు. సోమవారం స్థానికంగా ఆమె మాట్లాడారు. ఎన్యూమరేటర్ల సంఖ్యను పెంచాలన్నారు. అలాగే ప్రతి ఎన్యుమరేటర్‌కు 100లోపు కుటుంబాలు వచ్చేట్టు చూడాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయలకు కూడా పని భారం తగ్గించాలన్నారు. జిల్లా అధికారులు వెంటనే స్పందించి ఈ సమస్యను పరిష్కరించేలా చూడాలన్నారు. సమావేశంలో నాయకులు మహిపాల్, బాజీఖాన్, శిరీష, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి వంద రోజుల పని కల్పించాలి

వాంకిడి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): జాబ్‌కార్డు కలిగిన ప్రతిఒక్కరికి ఉపాధిహామీ పని కల్పించాలని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. మండలంలోని పిప్పర్‌గొంది గ్రామ పంచాయతీలో జరిగిన ఉపాధిహామీ గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధిహామీ పథకంలో అనుమతించిన పనులను గ్రామస్థులకు వివరించారు. ఆయాపనులను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పిప్పర్‌గొంది, పాటగూడనర్సరీ స్థలాన్ని సందర్శించి డిమాండ్‌కు అనుగుణంగా మొక్కలు పెంచేలా చర్యలు తీసుకోవాలని కార్యదర్శులను ఆదేశించారు. ఆయన వెంట ఈసీ మోసిన్, టీఏ అంబాజీ, కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన

లింగాపూర్, నవంబర్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని జిల్లాపరిషత్ పాఠశాలలో సోమవారం పోలీస్ కళాబృందంచే విద్యార్థులకు నూతన చట్టాలు, సామాజిక బాధ్యతలు, సైబర్ నేరాలు, ట్రాఫిక్ నియమాలు, షీటీం, సీసీ కెమెరాల ఆవశ్యకత, తదితరఅంశాలపై అవగాహన ఎస్సై ప్రవీణ్‌కుమార్ అవగాహన కల్పించారు. ఆపదలో పోలీసుల కోసం100కు డయల్‌చేస్తే తక్షణమేసహాయం అందుతుందన్నారు. కార్యక్రమంలో పోలిస్‌కళాజాత బృందం సభ్యులు, అధికారులు రాంచందర్, రోహిత్, వెంకటేష్, చంద్రశేకర్, సంఘవి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ కరాటేలో గోల్డ్ మెడల్


స్నేహలత

బెజ్జూరు, నవంబరు 11 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని సలుగుపల్లి గ్రామానికిచెందిన మడావి స్నేహలత అంతర్జాతీయ కరాటేలో గోల్డ్‌మెడల్ సాధించింది. సలుగుపల్లికిచెందిన ఉపాధ్యాయులు మనోహర్-రాధ దంపతుల కుమార్తె స్నేహలత గోవాలో జరిగిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించడంతో మండలవాసులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. 33దేశాలకు చెందిన క్రీడాకారులు పాల్గొనగా కజకిస్తాన్ దేశంపై పోరాడి గోల్డ్‌మెడల్ సాధించింది. దీంతో గిరిజన, ఆదివాసీ సంఘాల నాయకులు ఆమెను సన్మా నించారు.

సెపక్‌తక్రా రాష్ట్రసభ్యులుగా రెబ్బెన వాసులు


రామకృష్ణ


మల్లేష్

రెబ్బెన, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సెపక్‌తక్రా రాష్ట్రసంఘ కార్యవర్గంలో సభ్యులుగా రిక్కువెంకట రామకృష్ణ, కుమ్మరి మల్లేష్‌ను ఎన్నుకున్నట్టు ప్రధానకార్యదర్శి ఆర్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంఘం నిర్వహణ 2024-28వరకు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఎన్నికైన రామకృష్ణ, కుమ్మరి మల్లేష్ మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి రాష్ట్ర కార్యవర్గంలో చోటు కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఒలింపిక్ వైస్‌ప్రెసిడెంట్ ఆర్ నారాయణ రెడ్డి, రాష్ట్ర సెపక్‌తక్రా టోర్నీకమిటీ చైర్మన్ బాస్కర్ తదితరులు వారిని అభినందించారు.

ఘనంగా కార్తీక దీపోత్సవం


వాగులో దీపాలను వదులుతున్న మహిళలు

ఆసిఫాబాద్ రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసాన్ని పురస్కరించుకొని మహిళలు గంగా హారతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పుణ్యస్నానాలు ఆచరించి మహిళలు స్థానికపెద్దవాగులోదీపాలను వదిలారు. అనంతరం ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విద్యార్థులకు అభినందన

ఆసిఫాబాద్ రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వాసవీ ఉన్నతపాఠశాల విద్యార్థులు సానిక, యోచన రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ఉత్తమప్రతిభ కనబరిచి ఉమ్మడి ఆదిలాబాద్‌జట్టు తరఫున పాల్గొని మొదటిస్థానంలో నిలువడంతో సోమవారం ప్రిన్సిపాల్ క్రాంతికుమార్ వారిని అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులను సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సురేష్, రాజ్‌కుమార్, పీఈటీ సాయి ఉన్నారు.



శ్రీప్రసన్న పరమేశ్వరాలయాన్ని సందర్శించిన జీఎం


జీఎంను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

రెబ్బెన, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నంబాల గ్రామంలో ఉన్న శ్రీప్రసన్న పరమేశ్వరాలయాన్ని సోమవారం బెల్లంపల్లి ఏరియా జీఎం శ్రీనివాస్ కుటుంబ సమేతంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో పూజలు నిర్వహించారు. తొలిసారిగా ఆలయానికి వచ్చిన సందర్భంగా మాజీసర్పంచి చెన్న సోమశేఖర్ ఆలయం గురించి ఆయనకు వివరించారు. అనంతరం ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు మాసాడి జగన్, చెన్న సాయి కుమార్, గ్రామస్థులు శంకరయ్య, ఇంగు శశికిరణ్, రాజన్న, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మానసిక ప్రశాంతత కోసం ధ్యానం చేయాలి

బెల్లంపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మానసిక ప్రశాంతత కోసం ప్రతిఒక్కరూ ధ్యానంచేయాలని సింగరేణి గోలేటి జీఎం శ్రీనివాస్ తెలిపారు. సోమవారం బెల్లంపల్లిసింగరేణి ధ్యానమిత్రకేంద్రంలో ఏర్పాటుచేసిన పత్రిజీ జన్మదినవేడుకల్లో ఆయన సతీమణి ఉమతో కలిసి పాల్గొన్నారు. జీఎం మాట్లాడుతూ ప్రస్తుతం ఉరుకుల పరుగుల పోటీ ప్రపంచంలో ప్రశాంతంగాఉండాలంటే ధ్యానం చేయాలన్నారు.

కలిసికట్టుగా సమస్యలపై పోరాడుదాం

శ్రీరాంపూర్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): సమస్యలపై కలిసికట్టుగా పోరాడుదామని శ్రీరాంపూర్ ఏరియాలో పనిచేస్తున్న బీసీ నాయకులు పేర్కొన్నారు. సోమవారం ఆర్కే5 గనిపై సమావేశమయ్యారు. బీసీ సంక్షేమ సంఘం విధివిధానాలు, ఉద్యోగరీత్యా జరుగుతున్న అన్యాయాలు, రిజర్వేషన్, స్థానిక సంస్థల ఎన్నికలువంటి సమస్యలపై చర్చించారు. ఈనెలలో జరగబోయే మహాసభకు బీసీలు పెద్దఎత్తున సమాయత్తం కావాలని సూచించారు. అనంతరం బీసీ సంక్షేమసంఘం ఆర్కే5గని కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా పంచెర్పుల నరేష్, కోకన్వీనర్‌గా కొట్టె శ్రీకాంత్‌ను నియమించారు. ఆర్కే6 గని కమిటీ కన్వీనర్‌గా కారుకూరి నగేష్, కోకన్వీనర్‌గా సైదం చిరంజీవిని నియమించారు. ఈ కమిటీ మహాసభ విజయవంతానికి జన సమీకరణ, సంక్షేమం, తదితర కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో డివిజన్ నాయకులు పేరంరమేష్, ముష్కె సమ్మయ్య, మోతుకూరి కొమురయ్య, బరపటి మారుతి, బద్రి బుచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

సర్ఫేస్ పోస్టుల కోసం కౌన్సెలింగ్

శ్రీరాంపూర్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆర్కే5, ఆర్కే7 గనులలో పనిచేస్తున్న మహిళా కార్మికులకు సోమవారం జీఎం కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. 16 డిసిగ్నేషన్ల కోసం కమిటీ సభ్యులైన ఇన్‌చార్జి ఎస్ఓటు జీఎం శ్రీధర్ రావు, డీజీఎంలు అరవిందరావు, చిరంజీవులు, డిప్యూటీ సీఎంవో డాక్టర్ రమేష్‌బాబు కార్మికులు ఇచ్చిన ఆప్షన్లను పరిశీలించారు. వారు ఎంచుకున్న ఉద్యోగాలకు అనుగుణంగా తగినశిక్షణ అందించిన అనంతరం విధులు అప్పగిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్కే5 గని మేనేజర్ సుధీర్ కుమార్ ఝా, రక్షణాధికారిరాందాస్, సంక్షేమాధికారులు రణదీప్‌గౌడ్, సంతన్, తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌పీని సందర్శించిన కార్పొరేట్ క్వాలిటీ జీఎం

రెబ్బెన, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి సీహెచ్‌పీని కార్పొరేట్ క్వాలిటీ జీఎంరవికుమార్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా క్వాలిటీకి సంబంధించిన విషయాలను బెల్లంపల్లి ఏరియా జీఎం శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. అలాగే పెండింగ్ సమస్యలను కూడా అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏరియాఇంజనీర్ భీంరావు జాడే, ఏరియా సెక్యూరిటీ అధికారి ఉమాకాంత్, సీహెచ్‌పీ ఇన్‌చార్జీ కోటయ్య, క్వాలిటీఇన్‌చార్జి రవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూల మొక్క అందజేసి శాలువాతో జీఎం ఘనంగా సన్మానించారు.

విధులను నిర్లక్ష్యం చేయవద్దు

శ్రీరాంపూర్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు తమ విధులను నిర్లక్ష్యం చేయవద్దని అధికారులు పేర్కొన్నారు. సోమవారంఆర్కే5, శ్రీరాంపూర్ ఓసీపీలలో గైర్హాజరవుతున్న ఉద్యోగులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. కారణాలు లేకుండావిధులకు రాకపోవడం సరికాదన్నారు. దీనివల్ల సంస్థ ఉత్పత్తిలక్ష్యం సాధించలేమని తెలిపారు. ఇక నుంచైనా మస్టర్లు భర్తీ చేసేందుకు కృషి చేయాలని, మంచి వేతనం పొంది కుటుంబాలతో సుఖ సంతోషాలతో గడపాలని ఆదేశించారు. ఆయా కార్యక్రమాల్లో ఆర్కే5,6 గ్రూపుఏజెంట్ శ్రీధర్, ఆర్కే5 మేనేజర్ సుధీర్ కుమార్ ఝా, ఓసీపీ మేనేజర్ బ్రహ్మాజీ రావు, సంక్షేమాధికారులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులకు రివైజ్డ్ పెన్షన్ అందించాలి

శ్రీరాంపూర్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు రివైజ్డ్‌పెన్షన్ అందించాలని టీబీజీకేఎస్ రాష్ట్రప్రధానకార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్‌చేశారు. 2023-24ఆర్థిక సంవత్సరంలో రిటైర్‌అయిన వారికి సైతం లాభాలవాటా, పీఎల్ఆర్ బోనస్‌ను వెంటనే ప్రకటించాలన్నారు. మెడికల్ కార్డు రెన్యూవల్, లైఫ్‌సర్టిఫికెట్ కోసం సింగరేణి యాజమాన్యం ప్రత్యేక వెబ్‌సైట్‌ను నిర్వహించాలన్నారు. ఆయా సమస్యలను పరిష్కరించని పక్షంలో రిటైర్డ్‌కార్మికుల కోసం ఉద్యమిస్తామని హెచ్చరించారు.

ఘనంగా మైసమ్మ తల్లి దేవాలయ వార్షికోత్సవం

బెల్లంపల్లి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లిలోని శాంతిఖని గనిషాప్ట్ ఆవరణలో ఉన్న మైసమ్మదేవాలయం తృతీయ వార్షికోత్స వాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో అభిషేకం, గణపతిపూజ, కలశస్థాపన, చండీయాగం నిర్వహించారు. అనంతరంఅన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మందమర్రిఏరియా ఇన్‌చార్జీజీఎం రాందాస్, ఎస్ఓటూ జీఎం విజయప్రసాద్, ఏరియాఇంజనీర్ వెంకటరమణ,నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

ఏజెన్సీ భూమి కబ్జా

5వ పేజీ తరువాయి

ఈ విషయమై తహసీల్దార్ 19-02-2022న ఐటీడీఏ పీవోకు లేఖ రాస్తూ సర్వే నంబరు 17లో అర్హులైన 15 మంది గిరిజనులు ఆధారాలు సమర్పిం చి నందున ఇళ్ల స్థలాలు కేటాయించనున్నట్లు తెలిపారు. అనంతరం సదరు స్థలంలో లేఅవుట్ అప్రూవల్‌తో ప్లాట్లు సైతం ఏర్పాటు చేశారు. లబ్ధిదారులకు ఇంటి స్థలాలు కేటాయించకపోవడంతో అదును చూసి వ్యాపారి భూమి మొత్తాన్ని అక్రమంగా తన ఆధీనంలోకి తీసుకున్నాడు.

● కలెక్టర్‌కు స్థానికుల ఫిర్యాదు

గిరిజనుల భూములను గిరిజనేతరుడు కబ్జా చేసిన విషయమై కొందరు గ్రామస్థులు గత నెల 28న కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల విభాగంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తన పలుకుబడిని ఉపయోగిస్తూ అధికారులు ఆ స్థలం వైపు కన్నెత్తి చూడకుండా చేస్తున్నాడని, వ్యాపారి నిర్వాకం వల్ల నిరుపేదలైన గిరిజనులు ఇళ్ల స్థలాలకు నోచుకోవడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయమై మండల అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రాముని చెరువు వాకర్స్ కార్యవర్గం

గర్మిళ్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని రాముని చెరువు వాకర్స్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం సోమవారం నిర్వహించి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఆకుల సత్తన్న, గజెల్లి వెంకటయ్య, ఉపాధ్యక్షులుగా చింతకింది రమేష్, భాస్కర్‌రావు, రాజేందర్‌రెడ్డి, జ్ఞాని, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా లాల్‌కుమార్, నర్సయ్య, రాజేశం, కార్యవర్గ సభ్యులుగా మనోహర్‌రావు, ప్రతాప్‌రెడ్డి, అంజన్న, మల్లేషన్న, మనోహర్, కృష్ణరావు, సలహాదారులుగా సుధాకర్‌రెడ్డి, సత్యనారాయణమూర్తి, గురువయ్య, సత్యనారాయణరెడ్డి, ప్రభాకర్, తిరుపతి, పర్వతాలుయాదవ్, రఘు, రెడ్డన్న, రాధాకృష్ణ, రాజయ్య శంకర్, చందులను ఎన్నుకున్నారు.

పరీక్ష కేంద్రాలను పరిశీలించిన సీఐ

మందమర్రిటౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రూప్ 3 పరీక్ష కేంద్రాలను సోమవారం సీఐ శశిధర్‌రెడ్డి పరిశీలించారు. ఈ నెల 17, 18 తేదీల్లో జరిగే పరీక్షకు సింగరేణి మహిళ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రంతోపాటు శ్రీచైతన్య పాఠశాల పరీక్ష కేంద్రాలను ఆయన పరిశీలించారు. నిర్వాహకులతో మాట్లాడి తగిన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఆయన మాట్లాడుతూ ముందస్తుగా పరీక్ష కేంద్రాలను పరిశీలించామన్నారు. మందమర్రిలో 7 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు జరగనున్నాయని, 2064 మంది హాజరు కానున్నారని తెలిపారు. పరీక్ష కేం ద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశామన్నారు. ఎస్ఐ రాజశేఖర్, సిబ్బంది ఉన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలి

జన్నారం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని నవతరం స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రామ్‌ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ కళాశాల లేక పేద విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లలేక చదవులకు దూరమవుతున్నారన్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కృషి చేయకపోవడం సరైంది కాదన్నారు. వెంటనే డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

గర్మిళ్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధి లయన్ మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో కాసిపేట మండలం మల్కపల్లి గ్రామానికి చెందిన విజయ్ తల్లిదండ్రులకు రెండు నెలలకు సరిపడ సరుకులను అందజేశారు. లయన్స్ క్లబ్ మంచిర్యాల అధ్యక్షుడు బాల మోహన్, మెంబర్లు పాల్గొన్నారు.



పెళ్లి ఖర్చులు తడిసి మోపెడు

● మారిన పెళ్లిళ్ల ధోరణి
● హంగు ఆర్భాటాలతో వేడుకలు
● లక్షల రూపాయల ఖర్చుకు వెనకాడని తీరు



పెళ్లి మండపం



ఫొటోషూట్

బెల్లంపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వివాహ తంతు మారింది. గతంలో సాదాసీదాగా వివాహాలు జరగగా ప్రస్తుతం లక్షల్లో ఖర్చు చేస్తున్నారు. ఒకరిని చూసి మరొకరు వెనుకాడకుండ ఖర్చు చేస్తున్నారు.

గతంలో ఇంటి ముందు పందిరి వేసి.. కూరగాయాలతో కూర్చొబెట్టి (బంతిభోజనం) పెట్టేవారు... కొబ్బరి ఆకులతో పందిరి... మార్కెట్లో లభించే రంగు కాగితాలతో పువ్వులుగా తయారు చేసి సాదాసీదాగా అలంకరించేవారు. వివాహపనుల్లో బంధువులు కూ డా అండగా నిలిచేవారు... పెండ్లి బట్టలు కూడా కుటుంబ సభ్యులు ఒకటి రెండు మినహా పెద్దగా కొనుగోలు చేసేవారు కాదు. ప్రస్తుతం ఫంక్షన్ హాల్, డెకొరేషన్, సౌండ్ సిస్టం, హల్దీ, సంగీత్, బరాత్, ఫొటోగ్రాఫర్, విందు, వినోదాలకు లక్షల్లో ఖర్చు చేస్తున్నారు. ఒకప్పుడు కట్నకానుకల విషయంలో ఆలోచించే వారు. ఇప్పుడు మాత్రం పెళ్లిళ్లకు అయ్యే ఖర్చులే కట్నకానుకల కంటే ఎక్కువ అవుతున్నాయని పలు వురు అభిప్రాయ పడుతున్నారు. గ్రాండ్‌గా చేసిన పెళ్లి గురించి అందరు గొప్పగా చెప్పుకోవాలని ఖర్చు లకు వెనకాడడం లేదు.

● భోజనాల కోసం లక్షల్లో ఖర్చులు..

వివాహం, రిసెప్షన్ పోటాపోటీగా ఏర్పాటు చేస్తున్నారు. భోజనాల్లో కనీసం 20నుంచి 30రకాల వంటకాలు అందుబాటులో ఉంచుతున్నారు. వారి అభిరుచులకు తగినట్లు వివిధ కేటరింగ్ సర్వీసులకు లక్షల రూపాయలు వెచ్చిస్తున్నారు. పెళ్లిళ్లలో శాకాహారంతో పాటు మాంసాహారం, అలాగే నార్త్, సౌత్ వంట కాలకు సైతం ప్రాధాన్యత ఇస్తున్నారు. వెల్‌కం డ్రింక్, స్నాక్స్ ఇస్తున్నారు. అంతే కాకుండా ఐస్‌క్రీం, పానీపూరి, కట్లెస్, కద్దుకకీర్, గులాబ్ జామూన్, కుబాని, వీటితో పాటు ఇడ్లీ, దోశ, పూరీ వంటి అల్పా హారం సైతం అందుబాటులో ఉంచుతున్నారు. మాంసాహారంలో చికెన్, మటన్, చేపలు, రొయ్యలు, బిర్యానీ, గుడ్లు, కబాబ్ సప్లయి చేస్తున్నారు. ఆయా కేటరింగ్ సర్వీసులు పెళ్లి వారు ఎంచుకున్న మెను ప్రకారం ఒక్కో ప్లేటుకు రూ. 300 నుంచి 650 వరకు వసూలు చేస్తున్నారు.

● కట్నకానుకల కంటే ఖర్చులకే ఎక్కువ

మారిన వివాహధోరణితో కట్నకానుకల కంటే పెళ్లి ఖర్చులే అధికమవుతున్నాయని వధూవరుల తల్లి దండ్రులు పేర్కొంటున్నారు. గతంలో పెళ్లి వ్యవస్థలో కట్నం విషయంలోనే ప్రధానంగా ఆలోచిం చేవారు. ఇప్పుడు పెళ్లి ఏవిధంగా జరపాలనే విషయంపైనే ఎక్కువగా ఆలోచిస్తున్నారు. సొసైటీలో స్టేటస్‌కోసం ఖర్చు చేస్తున్నారు. పట్టణాలు, మండ లాల్లో సైతం ఫంక్షన్ హాల్‌లు ఏర్పాటు చేస్తున్నారు. సెంట్రల్ ఏసీతో పాటు వివిధ సౌకర్యాలను కల్పిస్తు న్నారు. ఫంక్షన్‌హాళ్ల కోసం లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. ఇందులో డెకొరేషన్‌కు అదనంగా చెల్లిస్తున్నారు. ఫంక్షన్ హాళ్లలో సౌండ్, లైట్‌సెట్టింగ్, పూలఅలంకరణ, కళ్లు జిగేల్‌మనేలా సెట్టింగులు, ఫర్నీచర్‌తో పెళ్లి వేడుకలు, డ్రోన్ కెమెరాలతో వీడియో షూట్‌లు ఉంటున్నాయి. వివాహం అనంతరం సైతం బరాత్ పేరుతో డీజేలను ఏర్పాటు చేస్తున్నారు. దీనికి తోడు వేల రూపాయల టపాసులను కాలుస్తున్నారు. ఇక దావత్‌ల పేరుతో వేలరూపాయలు ఖర్చు చేస్తున్నారు. మారిన వివాహ ధోరణితో పేద మధ్య తరగతి కుటుంబాలు పెళ్లిళ్లకు తలకు మించిన ఖర్చు చేస్తున్నారు.

● బంగారం, దుస్తులపై ఆసక్తి...



పెళ్లి వేడుకల్లో వధూవరుల కుటుంబ సభ్యులు బంగారు నగలు, దుస్తులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. హల్దీ, సంగీత్, వివాహం, రిసెప్షన్‌లకు వేర్వేరు దుస్తులు కొనుగోలు చేస్తున్నారు. వధూవరుల తల్లిదండ్రులు సైతం ఆయా వేడుకల్లో డ్రెస్‌కోడ్ పాటిస్తున్నారు. వివాహాల్లో వధూవరులు, కుటుంబీకుల కోసం కొనుగోలు చేస్తున్న బట్టలకే లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారు. అలాగే బంగారు ఆభరణాల కోసం మరింత ఖర్చు చేస్తూ ఖర్చు విషయంలో వెనుకాడకుండా పెళ్లిళ్లు చేస్తున్నారు.

● మారిన పెళ్ళిళ్ల ధోరణి



గతంలో పెళ్లిళ్లు నిరాడంబరంగా జరిగేవి. ఇంటి వద్దనే ఎంగేజ్‌మెంట్, ఇంటి ముందు పాల పొర్కతో పచ్చని పందిరి వేసి వివాహం జరిపేవారు. ప్రస్తుతం హంగు ఆర్భాటాలకు పెళ్లిళ్లు వేదిక అవుతున్నాయి. వివాహం నిశ్చయం అయిన తర్వాత ప్రీ వెడ్డింగ్, వీడియోషూట్, ఆర్భాటంగా మండపాలు, మెహందీ, సంగీత్, వివిధ రకాల భోజనాలు, రిసెప్షన్ వంటివి చేస్తున్నారు. ఇందు కు అనుగుణంగా తమ ప్రాంతాల్లోని ఫంక్షన్ హాల్‌ను బుక్ చేసుకుంటున్నారు. నాలుగు రోజుల పాటు పెళ్లి వేడుకలు నిర్వహిస్తున్నారు. హల్దీ సంగీత్ ఒకరోజు, మరో రోజు వివాహం, అనంతరం రిసెప్షన్ వంటివి చేస్తున్నారు. ఇందుకోసం ఏకంగా ఈవెంట్ మేనేజర్‌లను కలిసి లక్షల రూపాయలు వెచ్చించి పెళ్లి వేడుకలు నిర్వహిస్తున్నారు.

న్యూస్ బాక్స్

న్యాయ విజ్ఞాన సదస్సు

గర్మిళ్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని పాత మంచిర్యాల ప్రభుత్వ పాఠశాలలో సోమవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి అర్పితమారంరెడ్డి విద్యార్థులకు ర్యాగింగ్, బాల కార్మికుల నిర్మూలన, నిర్బంధ విద్యాహక్కు చట్టాలు, న్యాయం గురించి అవగాహన కల్పించాలన్నారు. ఆమె మాట్లాడుతూ ఎవరికైనా న్యాయ సలహాలు కావాలంటే టోల్‌ఫ్రీ నెంబర్ 15100కు ఫోన్ చేసి సహాయం పొందవచ్చన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం, తాగునీటి సౌకర్యాలను పరిశీలించారు. డిఫెన్స్ కౌన్సిల్ ఎండీ సందాని, ప్రధానోపాధ్యాయురాలు మాలతిదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నర్సరీల పరిశీలన

మందమర్రిరూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పొన్నారం, వెంకటాపూర్ గ్రామాల్లోని నర్సరీలను సోమవారం ఎంపీడీవో రాజేశ్వర్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మొక్కలను జాగ్రత్తగా సంరక్షించాలని, రెండు పూటలా నీరు పోయాలని సిబ్బందికి సూచించారు. కార్యదర్శులు ఉన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

మందమర్రిరూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మండల ప్రత్యేకాధికారి అనిత సూచించారు. సోమవారం కేజీబీవీ, మోడల్ స్కూల్ వసతి గృహాల్లో వంట గదులను తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. ఉద్యానవన అధికారి, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రూప్ 3 పరీక్షకు సర్వం సిద్ధం

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రూప్ 3 పరీక్ష నిర్వహణకు జిల్లాలో అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 17న ఉదయం, మధ్యాహ్నం, 18న ఉదయం 3 విడతల్లో పరీక్ష జరుగుతుందన్నారు. పరీక్ష నిర్వహణకు 48 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. 15,038 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారని తెలిపారు. వైద్య, తాగునీరు సౌకర్యాలు కల్పించాలన్నారు.

కార్తీక దీపాలు.. సామూహిక వ్రతాలు...



గూడెం వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు, బుగ్గ ఆలయంలో శివలింగానికి అభిషేకం

దండేపల్లి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): గూడెం సత్యనారాయణస్వామి ఆలయంలో సోమవారం వేలాది మంది భక్తులు సామూహిక వ్రతాలు ఆచరించారు. సమీప గోదావరి నదిలో కార్తీక స్నానాలు ఆచరించి, దీపాలను వదిలారు. అనంతరం సత్యదేవున్ని దర్శించుకొన్నారు. సుమారు 400మంది భక్తులు కుటుంబసమేతంగా స్వామి వ్రతాన్ని నోముకొని పూజలు చేశారు. ప్రధానాలయం ధ్వజ స్తంభం, రావి చెట్లు వద్ద భక్తులు కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ పేర్కొన్నారు.

బుగ్గ ఆలయంలో ...

బెల్లంపల్లి, (ఆంధ్రజ్యోతి): కార్తీక సోమవారం బుగ్గ ఆలయంలో కార్తీక శోభ సంతరించుకుంది. ఉదయం నుంచి భక్తుల రద్దీ పెరిగింది. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని శివునికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక దీపాలను వెలిగించారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకోవడంతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది. భక్తులకు ద్వారకపూర్ చెందిన మిట్ట చంద్రయ్య అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

సామాజిక మాధ్యమాల్లో వేధిస్తే

షీటీంకు ఫిర్యాదు చేయండి



పోస్టర్లను విడుదల చేస్తున్న సీపీ

మంచిర్యాల అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): యువతులను, మహిళలను ఎవరైనా ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌చాట్, టెలిగ్రామ్ లాంటి సామాజిక మాధ్యమాల్లో వేధింపులకు పాల్పడితే వెంటనే షీటీంకు ఫిర్యాదు చేయాలని రామగుండం సీపీ ఎం.శ్రీనివాస్ అన్నారు. సోమవారం కమిషనరేట్ కార్యాలయంలో రాష్ట్ర ఉమెన్ సేఫ్టీ వింగ్ విడుదల చేసిన గోడప్రతులను ఆయన ప్రారంభించారు. సీపీ మాట్లాడుతూ పిల్లలు, విద్యార్థినులు, యువతులు, మహిళల రక్షణే తమ ప్రధాన లక్ష్యమని, ఇబ్బందులకు గురైతే ధైర్యంగా ఉండాలని, వెంటనే డయల్ 100, పోలీస్ అధికారులకు, షీటీమ్ వాట్సాప్ నెంబర్ : 6303923700 ద్వారా సంప్రదిస్తే తక్షణ సహాయం లభిస్తుందన్నారు. డీసీపీ అడ్మిన్ రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, మంచిర్యాల జోన్ షీటీమ్ ఇన్‌చార్జి ఎస్సై హైమ, పెద్దపల్లి, మంచిర్యాల జోన్స్ షీటీమ్‌ల సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య ఖర్చుల కోసం ఆర్థికసాయం

దండేపల్లి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : రెబ్బనపల్లి గ్రామానికి చెందిన కట్ట హనుమయ్య కుమారుడు సుధాకర్ కొంత కాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. మాజీ సర్పంచు కందుల కళ్యాణిఅశోక్‌లు అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం రూ. 5వేల నగదును అందించారు. కట్ట వెంకటేష్, బుర్ర శ్రీనివాస్, భానుప్రసాద్, కుమారస్వామి. ఆకుల నవీన, లక్ష్మణ్ పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



వాలీబాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

దండేపల్లి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని టోర్నమెంట్ కన్వీనర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సిరంగి సుదర్శన్ అన్నారు. ఎస్‌జీఎఫ్ అండర్ 14 జోనల్‌స్థాయి వాలీబాల్ పోటీలను సోమవారం ప్రారంభించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడుతాయన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. 12 మంది విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశామన్నారు. పీడీ రోజీ వరకుమారి, మాజీ వైస్ ఎంపీపీ ఆకుల రాజేందర్, మాజీ ఉప సర్పంచు పుట్టపాక తిరుపతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపికైన విద్యార్థులు వీరే...

వాలీబాల్ పోటీలో ఆదిలాబాద్ ప్రథమ స్థానంలో, ద్వితీయ మంచిర్యాల జట్టు నిలిచాయి. ఎస్ రజనీకాంత్, ఏ యోగేష్, కార్తీక్, ఎస్.లక్ష్మణ్, ఎం అరవిండ్‌లు ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండల స్పోర్ట్స్ స్కూల్ (జాతర్ల), బి.కృష్ణ, ఎం.సన్నీశ్రీసాయి నిర్మల్ జిల్లా, మతిన్, ధనుష్ మంచిర్యాల జిల్లా (తాళ్లపేట), ఆర్ సాయిరాఘవ దండేపల్లి మండలం (రెబ్బనపల్లి), బి.అకిత్ లక్షెట్టిపేట మండలం (జెండావెంకటాపూర్), శంకర్ కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా (సిర్పూర్ కాగజ్‌నగర్)లు ఎంపికైనట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు

మంచిర్యాల అర్బన్, నవంబర్ 11 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురులో ఈనెల 4, 5 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు 11 మంది అండర్ 14, 17 విభాగాల్లో ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ జోబిన్ తెలిపారు. విద్యార్థులను, జోనల్ పీఈటీ రాజేందర్, పీఈటీలు కుమార్, అక్షయ్, కుమార్, అనూష, రేఖలను పాఠశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, ఏజీఎం అరవిందరెడ్డి, కోఆర్డినేటర్ నాగరాజులు అభినందించారు. అలాగే స్ప్రింగ్ ఫీల్డ్ హైస్కూల్ విద్యార్థులు అండర్ 14 బాలికల విభాగంలో సుహానా కాంస్యం, హిమాని వెండి, బాలుర విభాగంలో సాయి యశ్వంత్ కాంస్య, అండర్ 17 బాలికల విభాగంలో ఐశ్వర్య వెండి, బాలుర విభాగంలో వెంకటసాయి కాంస్య, రోహన్ కాంస్య పతకం సాధించారు. విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయుడు దేవేందర్‌ను కరస్పాండెంట్ అహ్మద్ ఖాన్, ప్రిన్సిపాల్ నాజియా, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

రజక సంఘం పట్టణ కమిటీ ఎన్నిక

జన్నారం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రజక సంఘం జన్నారం పట్టణ కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా సల్లూరి పెద్దన్న, కార్యదర్శిగా కుదురుపాక నరేష్, ఉపాధ్యక్షులుగా సట్ల భీమయ్య, కొమురయ్య, క్యాషియర్‌గా సత్యం, సలహాదారులుగా సురేష్, మల్లేష్, గంగన్నలను ఎన్నుకున్నారు.

గురుకులాల్లో క్రీడల అభివృద్ధికి కృషి



పోటీలను ప్రారంభిస్తున్న రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ చైర్మన్

లక్షెట్టిపేటరూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గురుకులాల్లో క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ చైర్మన్ కోట్నాక తిరుపతి అన్నారు. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల మైదానంలో జోనల్ స్థాయి క్రీడా పోటీలను సోమవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇటీవల లక్షెట్టిపేట పరిసరాల్లో సమీకృత గురుకుల విద్యాలయానికి ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు ప్రారంభోత్సవం చేశారన్నారు. పోటీల్లో 1275 మంది క్రీడాకారులు పాల్గొంటున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ నెల 11 నుంచి 14 వరకు అండర్ 14, 17, 19 విభాగాలకు సంబంధించి పది రకాల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జోనల్ ఆఫీసర్ అరుణకుమారి, డీసీవోలు నాగేశ్వర్‌రావు,దేవసేన పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థితో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

బెల్లంపల్లిరూరల్, నవంబరు 11 (ఆం ధ్రజ్యోతి): బెల్లంపల్లి ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల విద్యార్థి కె.ప్రభాస్ జాతీయ స్థాయి అండర్ 19 సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ అం జయ్య తెలిపారు. సోమవారం కళాశాలలో విద్యార్థిని అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో వెండి పతకం సాధించాడన్నారు.

శ్రీచైతన్యలో ఉడాన్ కార్యక్రమం



సంప్రదాయ వస్త్రాలంకరణలో విద్యార్థులు

మంచిర్యాల అర్బన్, నవంబర్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని లక్ష్మీనగర్ బ్రాంచ్ శ్రీచైతన్య పాఠశాలలో ఉడాన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ప్రీ ప్రైమరీ విద్యార్థులంతా వివిధ రాష్ట్రాల దుస్తులు ధరించి సాంస్కృతి, సంప్రదాయాలను నృత్య రూపంలో ప్రదర్శించారు. ఏజీఎం అరవింద్, ప్రిన్సిపాల్ అయూబ్, కోఆర్డినేటర్ రోజారాణి, ఇన్‌చార్జి కృష్ణవేణి పాల్గొన్నారు.

తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలి

మందమర్రిటౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులు కన్న కలలను సాకారం చేయాలని తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ రాష్ట్ర ముఖ్య సలహాదారు యాదగిరి శేఖర్‌రావు తెలిపారు. సోమవారం శ్రీకన్వెన్షన్ ఫంక్షన్‌హాలులో మంచిర్యాల వివేకవర్ధిని డిగ్రీ, పీజీ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకల్లో మాట్లాడారు. విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలన్నారు. కార్పొరేట్ కళాశాలలకు దీటుగా జిల్లా కేంద్రంలో అనేక కళాశాలలు మంచి విద్యను అందిస్తున్నాయని తెలిపారు. కళాశాల కరెస్పాండెంట్ చంద్రమోహన్‌గౌడ్ మాట్లాడుతూ కళాశాల వ్యవస్థాపకులు గోనె హన్మంతరావు ఈ ప్రాంత విద్యార్థులకు ఉన్నత విద్యను అందించేందుకు కళాశాలను ఏర్పాటు చేశారని తెలిపారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి.



నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

అనంతరం యాదగిరి శేఖర్‌రావును సన్మానించారు. ట్రస్మా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాపోలు విష్ణువర్ధన్ రావు, జిల్లా అధ్యక్షుడు సిద్దయ్య, రాష్ట్ర ప్రచార కార్యదర్శి రాంవేణు, మండల అధ్యక్షుడు ఉప్పలయ్య పాల్గొన్నారు.

కళాశాలలకు రూ.80 కోట్ల బకాయిలు

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రైవేటు కళాశాలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రూ.80 కోట్లు రావాల్సి ఉందని, దీంతో నిర్వహణ కష్టతరంగా మారిందని యాదగిరి శేఖర్‌రావు పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో చదువుకుంటున్న విద్యార్థుల పరిస్థితి దారుణంగా మారిందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. ట్రస్మా నాయకులు సిద్దయ్య, శ్రీకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినుల అస్వస్థతపై విచారణ

వాంకిడి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమపాఠశాలలో ఇటీవల విద్యార్థినులు అస్వస్థతకు గురైన ఘటనపై సోమవారం ఆర్డీవో లోకేశ్వర్‌రావు ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఇక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బందితోపాటు విద్యార్థినులను జరిగిన సంఘటనపై విడివిడిగా విచారించారు. విచారణ నివేదికను జిల్లాకలెక్టర్ పంపించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. విచారణలో డీఎంహెచ్‌వో సీతారాం, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్ రియాజ్‌అలీ, మిషన్‌భగీరథ డీఈ ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

ఆసిఫాబాద్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. దహెగాం మడలం దేవాజీగూడ గ్రామానికి చెందిన సిద్దం శ్రీహరి తనపేరిట ఉన్న భూమి తనఆధీనంలో ఉండగా ఆన్‌లైన్‌లో భూమిని తనకు విక్రయించిన వారిపేరిట చూపుతోందని, సవరించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. దహెగాం మండల కేంద్రానికి చెందిన బక్కయ్య ఐనం శివారులో కొనుగోలు చేసి రిజిస్టర్ అయిన భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, ఆసిఫాబాద్ మండలం అంకుశాపూర్‌కు చెందిన సాయికుమార్ నిరుపేద అయిన తనకు ప్రభుత్వ వైద్య కలాశాలలో ఉపాధి కల్పించి ఆర్థికంగా ఆదుకోవాలని అర్జీ సమర్పించారు. చింతలమానేపల్లి మండలం బాబాసాగర్‌కు చెందిన గంతిదాస్ మండలంలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని, మంచిర్యాల జిల్లా తాండూరు మండలం కిష్టంపేట గ్రామానికి చెందిన శాంత తాను కాగజ్‌నగర్‌లోని ఈఎస్‌ఐ ఆసుపత్రిలో పదిసంవత్సరాలుగా స్టాఫ్‌నర్సుగా పనిచేశానని తనను అకారణంగా తొలగించినందున తనకు న్యాయం చేయాలని అర్జీ సమర్పించారు. కెరమెరి మండల కేంద్రంలోని జడ్పీపాఠశాల ఉపాధ్యాయుడు గోపాల్ తనకు పెండింగ్ వేతనాలు ఇప్పించాలని, చింతలమానేపల్లి మండలం డబ్బాకు చెందిన భీమయ్య తనభూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించాలని దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించివెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

సమగ్ర సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలి



సర్వేను పరిశీలిస్తున్న ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి కృష్ణ ఆదిత్య

కాగజ్‌నగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి కులగణ సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలని ఉమ్మడిజిల్లా ప్రత్యేక అధికారి కృష్ణ ఆదిత్య తెలిపారు. సోమవారం కాగజ్‌నగర్ పట్టణం, మండలంలో సర్వే నిర్వహిస్తున్న సిబ్బందిని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ సర్వేలో ఎలాంటితప్పులు లేకుండాచూడాలన్నారు. కలెక్టర్ వెంకటేష్‌దోత్రే మాట్లాడుతూ సమగ్ర సర్వేలో ఎన్యుమరేటర్లు, అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లా, తహసీల్దార్ కిరణ్, మున్సిపల్ కమిషనర్ అంజయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు పంపిణీ



విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాల పంపిణీ చేస్తున్న ఎంఎస్ గిరి

కాగజ్‌నగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మున్సిపల్ వార్డు 3లో ప్రభుత్వప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సోమవారం ఎస్పీఎం పేపర్‌మిల్లు జీఎం ఎంఎస్ గిరి పుస్తకాలు, బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చక్కటి లక్ష్యాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. తద్వారా చక్కటి భవిష్యతు ఉంటుందన్నారు. కార్యక్రమంలో వార్డుకౌన్సిలర్ శివప్రసాద్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి



చెక్‌లను పంపిణీ చేస్తున్న కోనేరు కృష్ణారావు

కాగజ్‌నగర్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నుంచి వివిధ పథకాల కింద మంజూరైన ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఇన్‌చార్జి జడ్పీమాజీ చైర్మన్ కోనేరు కృష్ణారావు అన్నారు. సోమవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్‌లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

భారత కార్మికసంఘాల సమాఖ్య ఏరియా కమిటీ



ప్రమాణ స్వీకారం చేస్తున్న సభ్యులు

కాగజ్‌నగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): భారత కార్మిక సంఘాల సమాఖ్య కాగజ్‌నగర్ కమిటీ నూతన కార్యవర్గం సోమవారం ఏర్పాటైంది. అధ్యక్షుడుగా ఎం సంతోష్, ఉపాధ్యక్షుడుగా పార్వతి విలాస్, ప్రధానకార్యదర్శిగా ఎండీ అన్వర్, సహాయకార్యదర్శిగా కాజాబాయ్, కోశాధికారిగా పుప్పాల లక్ష్మీనారాయణ, సభ్యులుగా చంద్రన్న, నగేష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు భాస్కర్ మాట్లాడుతూ సంఘటిత, అసంఘటిత కార్మిక హక్కులకై నిరంతరం పోరాటాలను నిర్వహించినప్పుడే హక్కులు సాధిస్తామని వివరించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలను చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో రాష్ట్రనాయకులు కె విశ్వనాథ్, భీమన్న, పీడీఎస్‌యూ ఉమ్మడిఆదిలాబాద్‌జిల్లా అధ్యక్షురాలు కెఅఖిల, పీవోడబ్ల్యూ జిల్లా నాయకురాలు శశికళ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీరాజయ్య మృతి సాహితీలోకానికి తీరనిలోటు



నివాళులర్పిస్తున్న డాక్టర్ శ్రీనివాస్

కాగజ్‌నగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కవి శ్రీరామోజు లక్ష్మీరాజయ్య మృతి సాహితీ రంగానికి తీరనిలోటని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం శ్రీ రామోజు లక్ష్మీరాజయ్య పార్థివ దేహానికి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ లక్ష్మీరాజయ్య రచనలు, కవితలు రాష్ట్రస్థాయిలో గుర్తింపు వచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో పట్టణానికిచెందిన ఉపాధ్యాయ, ఉద్యోగ, వ్యాపార సంఘాల నాయకులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలకు నిలయంగా ఆశ్రమ పాఠశాలలు

గిరిపుత్రులకు భోజనవసతితోపాటు మెరుగైనవిద్యను అందించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన గిరిజన ఆశ్రమపాఠశాలలు సమస్యలకు నిలయాలుగా మారుతున్నాయి. గిరిజన గ్రామాల్లో ఏర్పాటు చేసిన గిరిజన ఆశ్రమపాఠశాలలపై ఉన్నతాధికారులు నిర్లక్షవైఖరిని అవలంబిస్తుండడంతో పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు సమస్యలతో సహవాసం చేయల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. బోధనపై శ్రద్ధ తీసుకుంటున్నా సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

- వాంకిడి



పనిచేయని సోలార్ వేడినీటి యంత్రాలు

- దుప్పట్ల పంపిణీ లేదు.. వేడినీటి యంత్రాలు లేవు
- కనీస వసతులు లేక విద్యార్థులకు తప్పని ఇబ్బందులు

జిల్లాలో 45 గిరిజన ఆశ్రమపాఠశాలలు ఉండగా 12,327మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. జిల్లాలోని అనేక పాఠశాలల్లో మరుగుదొడ్లు, మూత్రశాలలు, డైనింగ్‌హాల్, శుద్ధజలం, తదితర సమస్యలు వేధిస్తున్నాయి. పాఠశాలల్లో విద్యార్థులకు వేడి నీళ్ల అందించేందుకు ఏర్పాటుచేసిన సోలార్ వేడినీటి యంత్రాలు చెడిపోయి ఏళ్ల కావస్తున్నా అధికారులు మరమ్మతులు చేయడంలేదు. దీంతో విద్యార్థులు చన్నీళ్లతోనే సరిపెట్టుకోవాల్సి వస్తోంది. ప్రస్తుతం చలికాలం కావటంతో విద్యార్థులకు తిప్పలు తప్పడం లేదు. పాఠశాలల్లో డైనింగ్‌హాల్ లేకపోవడంతో పాఠశాల ఆవరణలోని చెట్ల కిందనీడలో, గదుల ముందు వరండాల్లో విద్యార్థులు భోజనాలు చేస్తున్నారు. వంటశాలలు లేకపోవడంతో వంటకాలు చేయడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యార్థులకు సరిపడా గదులు లేకపోవడంతో తరగతి గదుల్లోనే విద్యార్థులు నిద్రించాల్సి వస్తోంది.

• పంపిణీ కాని దుప్పట్లు

కనిష్టస్థాయికి పడిపోతున్న ఉష్ణోగ్రతలతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కో పాఠశాలల్లో 200నుంచి 500లకు పైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరిలో కొందరు జ్వరం, జలుబు, చర్మవ్యాధులు, రక్తహీనతతోపాటు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. చలికాలం ఆరంభంలో పంపిణీచేసే దుప్పట్లు నేటివరకు ఐటీడీఏ అధికారులు పంపిణీ చేయలేదు. దీంతో విరిగిన తలుపులు, ఊడిన కిటికీలతో ఆశ్రమపాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు చలికి గజగజ వణు కుతూ కాలం వెళ్లదీస్తున్నారు. అంతేగాక వసతిగృహాల్లో ఏఎన్ఎం పోస్టులు భర్తీ కాకపోవడంతో విద్యార్థులకు సకాలంలో వైద్యం అందడం లేదు. విద్యార్థులకు రాత్రి, పగలు ఏదైనా అనారోగ్య సమస్య వస్తే ఆశ్రమపాఠశాలల్లో ప్రథమచికిత్స చేయడానికి ఏఎన్ఎంలు అందుబాటులో లేక ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లక తప్పడంలేదు.



నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

• మరుగుదొడ్లు, మూత్రశాలలు కరువు

జిల్లాలోని ఆశ్రమపాఠశాలల్లో విద్యా ర్థుల సంఖ్యకు సరిపడా మరుగుదొడ్లు, మూత్రశాలలు లేవు, ఉన్న కొన్నిచోట అధ్వానంగా మారాయి. దీంతో విద్యార్థులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. అనేక పాశాలలకు డైనింగ్ హాల్‌లేకపోవడంతో అపరిశుభ్ర వాతావరణంలో వరండాల్లో, చెట్లకింద భోజనాలు చేస్తుండడంతో తరచూ విద్యార్థులు అనారోగ్యానికి గురవు తున్నారు. వాంకిడి బాలికల ఆశ్రమ పాఠశాలలో 571మంది విద్యార్థినులకు గాను కేవలం 20మరుగుదొడ్లు మాత్రమే ఉ న్నాయి. బంబార ఆశ్రమ పాఠశాలలో 299మంది విద్యార్థులకు కేవలం 10 మాత్రమే పనిచేస్తున్నాయి. ఇలా జిల్లా లోని అనేక ఆశ్రమ పాఠశా లల్లో విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక విద్యా ర్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతిసంవత్సరం పాఠశాలల్లో అవ సరంఉన్న మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మా ణానికి సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు ప్రతిపాదనలు పంపించడమే తప్ప నిధులు మంజూరై నిర్మాణాలు చేపట్టిన దాఖలాలు లేవు. ఉన్నతాదికారులు స్పందించి ఆశ్రమపాఠశాలల్లో అన్నివిధాల వసతులు కల్పించి విద్యార్థు లకు మెరుగైన విద్యను అందించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

అందరికీ ఆదర్శం మౌలానా అబుల్ కలాం: కలెక్టర్



నివాళులు అర్పిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్, అధికారులు

ఆసిఫాబాద్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): భారత దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్‌కలాం ఆజాద్ జీవితం అందరికీ ఆదర్శనీయమని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం అబుల్ కలాం జయంతిని పురస్కరించుకుని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వేడుకకు అదనపు కలెక్టర్ దీపక్‌తివారితోకలిసి హాజరై జ్యోతిప్రజ్వలన చేశారు. ఆజాద్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారతదేశ తొలివిద్యాశాఖ మంత్రిగా ఎన్నో వినూత్నసంస్కరణలతో విశిష్టసేవలు అందించారని అన్నారు. విద్యాసంస్థలు, విశ్వవిద్యాలయాల ఏర్పాటుకు కృషిచేశారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ అధికారి రమాదేవి, జిల్లాపంచాయతీ అధికారి భిక్షపతి గౌడ్, ఎస్సీ అభివృద్ధి అధికారి సజీవన్, డీఎల్పీవో ఉమర్ హుస్సేన్, అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడలతోపాటు చదువులో రాణించాలి..

విద్యార్థులు క్రీడలతోపాటు చదువులో రాణించాలని కలెక్టర్ వెంకటేష్‌దోత్రే అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో క్రీడాపోటీల్లో గెలిచిన విద్యార్థులను అదనపుకలెక్టర్ దీపక్‌తివారితో కలిసి అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలలో నైపుణ్యాన్ని పెంపొందించుకొని ఏకాగ్రతతో చదువులోనూ రాణించాలన్నారు. ఈనెల6,7,8వతేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి గిరిజన సంక్షేమ బాలికల క్రీడాపోటీల్లో జిల్లాకేంద్రంలోని గిరిజనసంక్షేమ క్రీడాపాఠశాలకుచెందిన అండర్-14,-17సంవత్సరాల వయస్సుగల విద్యార్థినులు ఓవరాల్ చాంపియన్ షిప్, కరీంనగర్ జిల్లా హుస్నాబాద్‌లో నిర్వహించిన హ్యాండ్ బాల్‌పోటీలు, ఉట్నూర్‌లో నిర్వహించిన ఖోఖోపోటీల్లో పాల్గొని బంగారు పథకాలు సాదించారని తెలిపారు. విద్యార్థులు క్రీడలతోపాటు విద్యలో రాణించాలని, సమాజంలో మంచి గుర్తింపును తెచ్చుకోవాలని అన్నారు. కార్యక్రమంలో గిరిజనాభివృద్ధి అధికారి రమాదేవి, గిరిజన సంక్షేమ క్రీడాధికారి మీనారెడ్డి, ఏసీడబ్ల్యూఓ ఉద్ధవ్, ప్రధానోపాధ్యాయుడు జంగు, శిక్షకులు విద్యాసాగర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త నిబంధనలతో కొద్దిసేపు నిలిచిన పత్తికొనుగోళ్లు

ఆసిఫాబాద్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కాటన్ కార్పొరేషన్‌ఆఫ్‌ఇండియా(సీసీఐ) కొత్త నిబంధనలు విధించడంతో జిల్లాలో సోమవారం ఉదయంనుంచి జిన్నింగ్ మిల్లులలో పత్తి కొనుగోళ్లు నిలచిపోయాయి. అనంతరం మధ్యాహ్నంనుంచి ప్రారంభమయ్యాయి. సీసీఐ గతంలో మాదిరిగా కాకుండా ఎల్1,ఎల్2, ఎల్3 పేరుతో కొనుగోళ్లను విడతల వారీగా చేపట్టాలని సీసీఐ నిర్ణయించింది. ఈనిబంధనలను వ్యతిరేకిస్తూ తెలంగాణ కాటన్‌మిల్ అసోసియేషన్ సోమవారంనుంచి జిన్నింగ్ మిల్లులలో కొనుగోళ్లు నిలపివేసినట్లు ప్రకటించింది. మార్కెటింగ్‌శాఖ, సీసీఐ,తెలంగాణ కాటన్‌మిల్ అసోసియేషన్ ప్రతినిధులచర్చలు సఫలంకావడంతో మధ్యాహ్నంనుంచి యథావిధిగా కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. దీంతో జిన్నింగ్ మిల్లులకు పత్తిని విక్రయించేందుకు పెద్దఎత్తున పత్తిలోడ్‌తో వాహనాలు తరలివచ్చాయి.

అబుల్‌కలాం ఆజాద్ ఆశయ సాధనకు కృషిచేయాలి

ఆసిఫాబాద్ రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు, భారత తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్‌కలాం అజాద్ ఆశయసాధనకు కృషిచేయాలని జామీయమజీద్ అధ్యక్షుడు ఫయాజ్, టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు రహెమన్ అన్నారు. సోమవారం ఎంఎం హెల్ప్‌లైన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మౌలనా అబుల్‌కలాం ఆజాద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంఎం హెల్ప్‌లైన్ అధ్యక్షుడు ఎండీ అహ్మద్, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ఉబేద్‌బీన్ యాహీయా, బీఆర్ఎస్ నాయకులు నిసార్, షర్ఫోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడిగా దినకర్

ఆసిఫాబాద్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడుగా దుర్గం దినకర్‌ను ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి భాస్కర్, రాష్ట్రనాయకుడు రవికుమార్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఈనెల9,10తేదీల్లో కాగజ్‌నగర్ పట్టణంలో జరిగిన సీపీఎం జిల్లా మూడవ మహాసభల్లో దుర్గం దినకర్‌ను ఎన్నుకున్నారు.

రోడ్డుకు మరమ్మతులు ప్రారంభం

దహెగాం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖర్జీ-మొట్లగూడ రోడ్డుకు సోమవారం బీజేపీనాయకులు మరమ్మతు పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు ధనుంజయ్, తిరుపతిగౌడ్, దామోదర్, బక్కన్న, బాపు, మల్లాగౌడ్‌పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట వీవోఏల ధర్నా

ఆసిఫాబాద్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో వీవోఏ ఉద్యోగులసంఘం ఆధ్వర్యంలో ఐకేపీలో పనిచేస్తున్న వీవోఏలు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజేందర్, వీవోఏల సంఘం జిల్లా అధ్యక్షుడు బుద్దు మాట్లాడుతూ వీవోఏలకు బకాయి ఉన్న స్త్రీనిధి ఇన్సెంటివ్‌ను వెంటనే చెల్లించాలన్నారు. కనీస వేతనం రూ. 20వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రూ.20లక్షల బీమా సౌకర్యం కల్పించి ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ, వీవోఏల సంఘాలనాయకులు కృష్ణమాచారి, రమ, రోజా, ధన్‌రాజ్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న వీవోఏలు

నిరుద్యోగ సమస్యలు పరిష్కరించడంలో పాలకులు విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధనకార్యదర్శి ధర్మేంద్ర

ఆసిఫాబాద్ రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగసమస్యలను పరిష్కరించడంలో పాలకులు విఫలం చెందారని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రదానకార్యదర్శి ధర్మేంద్ర అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చినప్రకారం నిరుద్యోగులకు రూ.3116నిరుద్యోగభృతిని చెల్లించాలని డిమాండ్‌చేశారు. ఏఐవైఎఫ్ జిల్లామూడవ మహాసభలనుడిసెంబరు9న నిర్వహించేందుకు తీర్మాణించారు. సమావేశంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రవి, జిల్లా కార్యదర్శి చిరంజీవి, నాయకులు మహేష్, రాకేష్, వికాష్, సుదీర్, రమ్య, దీప్తిలు పాల్గొన్నారు.

టోంకిని హనుమాన్ ఆలయానికి తరలిన భక్తులు

కెరమెరి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని సావర్ ఖేడ, గోయగాంగ్రామాలనుంచి పలువురు పాదయాత్రగా సోమవారం సిర్పూర్(టి)మండలం టోంకిని హనుమాన్ ఆలయానికి పాదయాత్రగా బయలుదేరివెళ్లారు. సుమారు 80కిలోమీటర్ల దూరంలో ఉన్న టోంకిని హనుమాన్‌ఆలయానికి పాదయాత్రగా భక్తులు తరలివెళ్లారు. కార్యక్రమంలో పటేల్, శంకర్, సోనాజీ, పోశెట్టి, బాపుజీ, పాండురంగ్ పాల్గొన్నారు.



గోయగాంనుంచి టోంకినికి పాదయాత్రగా వెళ్తున్న భక్తులు

కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వే



కెరమెరిలో సర్వేను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో ఉమర్‌హుస్సేన్

కెరమెరి/సిర్పూర్(టి)/ జైనూర్/కెరమెరి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలాల్లోని అన్ని గ్రామాల్లో సమగ్ర కుటుంబ సర్వే కొనసాగుతోంది. సోమవారం ఎన్యూమరేటర్లు గ్రామాలకు వెళ్లి ఇంటింటికి వెళ్లి వివరాలు నమోదు చేసుకుంటున్నారు. ఒక్క ఇంటి వద్ద సర్వే చేయడానికి 30 నుంచి 45 నిమిషాలు పడుతోంది. జైనూర్ మండలంలోని జామ్ని, పవర్‌గూడ, పొలాస తదితర గ్రామాల్లో ఉదయాన్నే ప్రజలు చేను పనికి వెళ్లడంతో సర్వే అధికారులు వెనుదిరిగిపోయారు. అనంతరం సాయంత్రం 5గంటలకు తిరిగివచ్చి సర్వే చేశారు. ఎంపీడీవోలు తహసీల్దార్లు సర్వేను పరిశీలిస్తున్నారు. కెరమెరిలో చేపడుతున్న సర్వేను డీఎల్‌పీఓ ఉమర్‌హుస్సేన్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివరాలను ఎలాంటి తప్పొప్పులకు తావివ్వకుండా సరి చేసుకుని నమోదు చేయాలన్నారు.

టోంకిని పాదయాత్రకు ఏర్పాట్లు పూర్తి



మాట్లాడుతున్న డీఎస్పీ రామానుజన్

సిర్పూర్(టి), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని టోంకిని సిద్ధి హనుమాన్ ఆలయానికి మంగళవారం కాగజ్‌నగర్ పట్టణం నుంచి చేపట్టనున్న 23వ మహాపాదయాత్రకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆలయం వద్ద భక్తుల దర్శణార్థం క్యూలైన్ల కోసం బారికేడ్లు, సేదతీరేందుకు షామియానాలు ఏర్పాటు చేశారు. అలాగే భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజన్ ఆధ్వర్యంలో సీఐలు, ఎస్సైలతోపాటు వందమంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటుచేయనున్నారు. ఇదిలా ఉండగా టోంకిని సమీపంలోని పెన్‌గంగా నదిలో మొసళ్లు ఉండడంతో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించడానికి వెళ్లకుండా అటవీశాఖ ఆధ్వర్యంలో ఆరుగురు సిబ్బందిని బందోబస్తు కోసం నియమించారు. అలాగే స్వచ్ఛందసేవా సంస్థలు, రాజకీయపార్టీల నాయకులు పాదయాత్ర భక్తులకు పండ్లు, ఫలహారాలు, తేనీరు, పాలు పంపిణీ చేయడానికి ఇప్పటికే ఏర్పాట్లు చేశారు.

భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలి: డీఎస్పీ

మహాపాదయాత్రలో పాల్గొనే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పోలీసులు సహకరించాలని డీఎస్పీ రామానుజన్ అన్నారు. క్యూలైన్లలో భక్తులు సమయపాలన పాటించేలా చూడాలన్నారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించే జాతరలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని, అత్యవసర సమయాల్లో సీఐ, ఎస్సైలకు సమాచారం అందించాలన్నారు. ఏర్పాటుచేసిన పార్కింగ్‌స్థలాల్లో వారి వాహనాలు నిలిపేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సీఐ రమేష్, ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.